

# సబ్బు బిళ్ళ

★

రచన : శ్రీ యల్. రాజా గణేష్, బి.యస్‌సి.

గబగబా ఇల్లుతుడిచినది. పాత్రలన్నీ తోమేసి. పొయ్యిరాజేసింది, పొయ్యిమీద ఎసరుపెట్టేసి వెళ్ళి కుళాయిదగ్గర నీళ్ళుపట్టి తెచ్చింది. గంటలో వంటపని కాస్తా ఎలాగైతేనేం పూర్తయిందనిపించి చెయ్యి తుడుకుంటూ అరుగుమీదికి వచ్చింది రత్తాలు.

ఇంకా సుచంద్ర పుస్తకం చదువుకుంటూనే కూర్చున్నాడు. "కాఫీ చేసిఫ్లాస్కులో పోశాను, తెమ్మంటూరా?" మామూలుగా అందామె.

అప్పటి వరకూ ఆమె చేష్టల్నీ, చేతల్నీ, నడకనీ, తిప్పనీ. అందచందాల్ని చాటుగా కిటికీగుండా పరిశీలిస్తూ ఉన్న సుచంద్ర పుస్తకం చదువుతున్న పోజులో .ఉన్నాడేమో పిసరంత తొట్రుపాటుపడ్డాడు.

"ఇవ్వు...ఇవ్వమంటేనే ఇస్తావా?" అని ఆమెని చూశాడు. చూస్తూనే ఉన్నాడు కన్నార్పకుండానూ. కొత్తగా ఉన్న అతని మాటలూ, ధోరణీ వింతగా చూసి లోనికి వెళ్ళింది రత్తాలు. క్షణంలో కాఫీ తెచ్చి ఇచ్చింది అంతే.

మళ్ళీ అదేచూపు. వాడైన చూపు వేడైన చూపు, అతని చూపు.

"ఏవిటా చూపు బాబో కాఫీ తాగండి చల్లారి పోద్ది" అంది తను.

కన్నార్పకుండా ఆమెను చూస్తూ రెండు గుటకల్లో తాగేశాడు అతను. తర్వాత మూతి తుడుచుకుంటూ—"రత్తాలూ! ఏం అనుకోనంటే చెప్పు...నిన్నో మాటడగాల నుంది." అన్నాడతను,

"ఏంటి బాబూ? నన్నడిగే విషయఏంటి?" తెలుసుకోవాలనే కుతూహలం ఆమెకళ్ళల్లో, గొంతులో స్పష్టంగా ప్రతిఫలించింది.

క్షణం సేపు మౌనంవహించి—"ఎవరేనా ఆడాళ్ళని ఏదైనా...అడిగితే వెంటనే ఒప్పేసుకుంటూరా?" ఏదైనా...అన్న చోట సాగదీసి మరీ పలికి వాక్యం పూర్తి చేసేసి ఠక్కున ఆగిపోయాడు.

మొదట వెగటుగా చూసింది రత్తాలు. అంతలోనే ఏవనుకుందో, పకపకా "వెర్రి బాబూ...వెర్రి...బాబు." అని నవ్వుతూ అంది. నవ్వి నవ్వి ఇకనవ్వలేక ఆయాసంతో "ఒప్పుకుంటూరు బాబూ! ఎందుకొప్పుకోరు? అందం, చదువూ, గుణం, ఆస్తీ, అంతస్థూ, ఉద్యోగం ఉన్న మిమ్మల్ని ఏ ఆడందైనా ఎందుకొప్పుకోదూ? ఏదేనా అడిగితే ఎందుకివ్వరూ? మనలో మనమాట...ఎవరైనా ప్రేమించారేటి బాబూ మీరు? ఆమెని ఏంటడిగారేంటి? పోనీ అడగబోతున్నారా?

ఏంటడగబోతున్నారేంటి?" చాలా ఎక్కువగా మాట్లాడింది రత్తాలు.

మౌనంగా ఉండిపోయిన సుచంద్ర-'కథ అడ్డం తిరిగింది. ప్చ్!' లోలోనే గొణుక్కున్నాడు. పైకి మాత్రం మామూలుగా నవ్వుతూ నిలుచున్నాడు.

అంతలోనే ఏదో ఉపాయం తట్టినట్లనిపించి- "అవన్నీ చెప్తాను కానీ ముందు నీ ముఖం కడుక్కురా. వెళ్ళు...ఊ!" అన్నాడతను.

"ఎందుకు బాబూ? ముఖం కడుక్కోడం?" అన్నట్టు చూసింది రత్తాలు.

"మసయింది సబ్బిళ్ళతో తోముకునిరా! వెళ్ళు!!" అన్నాడు తను.

"సరే" అని సబ్బిళ్ళ తీసుకుని పెరట్లోకి వెళ్ళిందామె.

కడిగిన ముత్యంలాంటి ముఖంతో, మరో అయిదు నిమషాల్లోనే ఆ గదిలో అడుగుపెట్టింది రత్తాలు. రత్తాలు అందమైనదే! ఆ అందం కేవలం శారీరకమైనది మాత్రమే కాదు. చేస్తున్నది నాలుగిళ్ళల్లో పాచిపనే అయినా ఆమె మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో, ధోరణిలో హృదయపూర్వకమైన సంస్కారమేదో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటుంది.

పైటకొంగుతో ముఖం కడ్డుకొని, ముఖం మీద ముసిరి తడిసిన ముంగురుల్ని పైకెగదోసి జడ వదులుపెట్టింది. వేగవేగంగా కొట్టుకుంటున్న గుండెలతో వెనగ్గానచ్చి ఆమెని చుట్టేశాడు సుచంద్ర. విస్తుపోయిందామె. 'ఎవర్నో ఏవిటి? నిన్నే! అడగాలని చాన్నాళ్ళనించి అనుకుంటున్నాను. నువ్వుచాలా అందంగా ఉంటావు నాక్కావాలి నువ్వు...నాక్కావాలి...నాక్కావాలి' చెవి దగ్గర గొణినట్లన్నాడు.

"వదలండి......." గొంతు చించుకు మరీ అరిచిందామె.

తుళ్ళిపడి ఆమెని వదిలేసి రెండడుగులు వెనక్కి వేశాడతను.

తుపాను తర్వాత ప్రశాంతతలా అయిదు నిముషాలకు పైగా మౌనంగా గడిచిపోయింది. ఆమెకళ్ళల్లో సన్నటి కన్నీటిపొర, ముఖంలో అసహ్యం పేరుకు పోయింది. సిగ్గుతో తల వాల్చేసుకున్నాడు సుచంద్ర.

"మీరింత నీచంగా ప్రవర్తిస్తారనుకోలేదు. అన్నన్ని పుస్తకాలు చదువుతారే! వాటినుండి మీరునేర్చుకున్న నీతేలేదా? నీతి! ఈ పదానికి యుగయుగాల మానవచరిత్రకున్న విలువంతా ఉంది. నీతి జాతి అంటారంటే నీతికి మన పెద్దలు ప్రథమస్థానం ఇచ్చారన్నమాట. విద్యకన్నా, సంస్కృతికన్నా, చివరికి ప్రాణం కన్నా నీతే ముఖ్యం. నాకు పెళ్ళయింది, ఇద్దరు పిల్లలున్నారు. నా కష్టసుఖాల్ని చూసే భర్తఉన్నాడు. నావిషయంలో మీరు చాలా నీచంగా ఆలోచించారు. సబ్బిళ్ళతో ముఖం కడుక్కుంటే శారీరకమైన మురికి వదుల్తుంది. మరి మనసు మాటేవిటి? మెదడు మాటేవిటి? ఆత్మ మాటేవిటి? వీటన్నింటినీ ఏ సబ్బిళ్ళతో కడగాలో? ఆలోచించండి." అనేసి చకచకా వీధిలోకి నడిచింది.

ఒక సామాన్యమైన పనిమనిషి నోటినుండి వెలువడిన అంతెంత లేసి మాటలు వింటూ తాయిలా ఉండిపోయాడతను. అంతే ఆ మరుసటి రోజే మరో ఇంట్లోకి మారిపోయాడు. మళ్ళీ ఆమెకు కనిపించలేదు తను. కానీ ఆమె చెప్పిన మాటలు సబ్బిళ్ళ సువాసనల్లో స్ఫురిస్తూనే ఉన్నాయి. 'ఔను! ప్రాణంకన్నా నీతి ముఖ్యం' గొణుగుక్కుంటూనే ఉన్నాడు సుచంద్ర జీవితాంతం.